# అంగీతం

— బి.ఉమామహేశ్వరి

"ఆడదిగా పుట్టడం కంటే అడవిలో మానై పుడితే మేలు" ఆ మాటలు సీతాలక్ష్మి చిన్నప్పుడే వింది.

సీతాలక్ష్మి తండ్రికి ఒక బట్టల షాపూ, ఊళ్ళో పలుకుబడీ వున్నాయి. అయినా సీతాలక్ష్మికి ఎనిమిదో ఏటనే పెళ్ళి జరిగిపోయింది.

అలాంటి సీతాలక్ష్మికి పద్దెనిమిదో సంవత్సరం వచ్చింది.

ఒకనాటి మధ్యాహ్నం సీతాలక్ష్మి తండ్రి ఎవరి మీదనో కేకలు వేయడం వింది. వంటింట్లో పని వదిలేసి వచ్చి చూసేసరికి నడికాలం దాటిన ఒకామె ఆప్యాయంగా సీతాలక్ష్మిని దగ్గరకు తీసుకొని తలను నిమిరింది. ముఖాన్ని అరచేతుల్లో వుంచుకొని ముద్దు పెట్టింది.

సీతాలక్ష్మి తండ్రి రెట్టింపు కేకలు వేస్తూ "మేనల్లుడన్న అభిమానంతో పసికందునిచ్చి పెళ్ళి చేశాను. ఇలాంటి వాడని తెలగానే నా బిడ్డ గొంతు చేజేతులా నేనే పిసికేసేనని తెలుసుకున్నాను" అంటూ ఇంట్లోకి వెళ్ళేడు.

అలా వెళ్ళిపోతున్న సీతాలక్ష్మి తండ్రితో వచ్చినామె "అదేటన్నా అంతేసి మాటలు! ఆశీర్వదించవలసిన నువ్వు అలా శపించకు" అంది.

సీతాలక్ష్మి తండ్రి అదేమీ వినిపించుకోలేదు. ఇంట్లో వున్న సీతాలక్ష్మి బట్టల పెట్టె తెచ్చి పడేసి వచ్చినామె ముఖమన్నా చూడకుండా వెళ్ళిపోయాడు.

వచ్చినామె తన ముందు పడేసిన పెట్టె పట్టుకొని "పదమ్మా! మనింటికెళ్దాం. పద పద" అంటూ తొందరచేసింది.

"మనిల్లు?!" అంటే ఇంకే ఇల్లో తెలీక సీతాలక్ష్మికి ఏడవాలనిపించింది. ద్వార బంధాన్ని ఆనుకొని నిలబడ్డ తల్లి వేపు చూస్తే తల్లి చూపులు నేల చూపులై పోయాయి. తమ్ముళ్ళిద్దరూ ఆమెని చూడకుండా ఒకరి తరవాత ఒకరు తండ్రి వెళ్ళిన వైపు వెళ్ళిపోయారు.

సీతాలక్ష్మికి అప్పుడు తెలిసింది– పుట్టి పెరిగి అంతవరకూ వుంటున్న ఆ ఇల్లు తనది కాదనీ, వేరే ఇల్లేదో తనకుందనీ - ఆ ఇంటికి ఇప్పుడు రమ్మని పిలుస్తున్నది తన మేనత్తనీ, వెళ్తున్నది తన భర్తతో కాపురానికనీ తెలిసిపోయింది.

అత్తతో వెళిపోతూ ఆఖరిసారిగా అంతవరకూ వుంటున్న ఇంటినీ కన్న తల్లినీ చూద్దామని ఆశగా చూసింది.

ఇల్లు తప్ప తల్లి కనబడలేదు.

ఇంతవరకూ ఆ ఇల్లూ ఇంట్లోని వారూ తన వారనుకుంది. ఇప్పుడు ఏమీ కారని తేలిపోగా ఆ ఇంటికి మరి రాకూడదని నిశ్చయించుకుంది.

అప్పుడు ఆమె కళ్ళనిండా కన్నీరే! వెచ్చని కన్నీరే!

ఆ రాత్రి సీతాలక్ష్మి మేనత్త ఇంట్లో హడావిడి! చిన్నప్పుడు అదెప్పుడో "అదుగో సీతా! నీ మొగుడు" అని ఎవరో ఆట పట్టించినప్పుడు చూడబోయి సిగ్గుపడి పోయింది.

ఆనాటి ఆ మాట నిజమై ఆ రాత్రి మొదటి సారి "అతనితో ఒంటరిగా వుండాలి" అన్నమాట జ్ఞాపకం వచ్చి సీతాలక్ష్మికి భయంవేసి ఏడవబోయింది. ఏడవడానిక్కూడా అవకాశం లేకుండా భర్త తన ముందు నిలబడ్డం గమనించింది. తనవేపే సూటిగా చూస్తున్న భర్తను చూడలేక చుట్టూ చూసింది.

కిరసనాయిలు బుడ్డీ దీపం కుదురు మీద వెలుగుతోంది. రేకుమూసి తుప్పపట్టిన ట్రంకు పెట్టెలు రెండు ఒక మూల వున్నాయి. పుస్తకాలు కుదురు పక్కన చాలా వున్నాయి. అవి మాత్రమే బాగున్నాయి గానీ మిగిలిన ఏ వస్తువూ ఆ ఇంట్లో చూడ్డానికి బాగులేవు.

చూడగానే పేద ఇల్లని ప్రతి వస్తువూ చెబుతుంది. ఒకప్పుడు పెద్దగా వుండి ఇప్పుడు పేదగా అయిపోయినందుకు తండ్రి అలా దెబ్బలాడేడనీ తన వాళ్ళెవరూ రాలేదనీ తెలుసుకుంది. భర్త సీతాలక్ష్మిలోని భావాల్ని గ్రహించినట్టుగా "సీతా! నాకు నువ్వే ఆస్తి! నీకు నేను! అంతే" అని ఆప్యాయంగా చుట్టుకున్నాడు.

సీతాలక్ష్మి కళ్ళ నుండి ధారగా కన్నీరు! చాలాసేపటి తరువాత భర్త కన్నీరు తుడుస్తూ "ఇలా ఈ రోజు కలిశాం. ఇలాగే కలిసి వుందాం" వెళ్ళిపోయినంతవరకూ!

తెల్లగా తెల్లవారిన తరువాత వీధిలోని వాళ్ళు చాలామంది వచ్చారు.

"సారె, చీరా, ముద్దూ ముచ్చటా లేకుండా ఇదేం చోద్యం తల్లీ. ఎక్కడాచూడలేదు. ఎప్పుడూ వినాలేదు" అన్నారు.

సీతాలక్ష్మి ఆ మాటలు వింది. ఆ తరవాత అత్త మాటలు వింది.

"మనిషి ముఖ్యం కానమ్మా మర్యాదలకేటుంది? ఎంత తెస్తే ఏం వుండిపోతుంది. మీకు తెలుసు కదా. అంత బంగారం, అన్ని భూములూ ఆస్తీ ఏమైంది? ఎలాగైపోయింది. మీరే చూశారు గదమ్మా - నా బిడ్డడి కష్ట సుఖాలకు ఆ వచ్చిన బిడ్డ నిలబడితే అంతకంటే ఏం కావాలి?" అంది.

అత్త మాటలు విన్న సీతాలక్ష్మికి కన్నీరు కట్టలు తెంచుకుంది. ముఖం కడుక్కునే నెపం మీద కారుతున్న కన్నీరు కనబడకుండా నీళ్ళు చాలాసేపు పోసుకుంది.

కాలం పేదతనం కనిపించనీకుండా వెళ్ళిపోతోంది. సీతాలక్ష్మికి మొదటి కాన్పు కనబడింది. అమ్మగారు పిలవడానికైనా వస్తారని ఆశపడింది. రాలేదు! మళ్ళీ వీధి వాళ్ళ మాటలు - ఆ మాటలకు అత్త సమాధానం.

"నాకెవరున్నారమ్మా? ఆడబిడ్డ లేనిదాన్ని! నా బిడ్డ ఒకటే, నా అన్న బిడ్డ ఒకటేనా? దానికి పురుడు పోయడం నాకు దొరికిన అదృష్టం."

ఆ మాటలకు సీతాలక్ష్మి తల్లినీ, తండ్రినీ, తమ్ముళ్ళనీ తలుచుకొని ఏడ్చింది. అత్త మాటలకు పేగులు మెలిపడగా కారుతున్న కన్నీరు తుడుచుకోకుండా వుండిపోయింది.

కాలం ఇప్పుడు మామూలుగా వెళ్ళకుండా మలుపు తిరిగింది! సీతాలక్ష్మి భర్తకు రెండు మాసాలుగా జీతం లేదు.

సమ్మె! సీతాలక్ష్మికి నిండు నెలలు!

భర్త సంఘాలని తిరుగుళ్ళు! రాత్రుళ్ళు రాతలు.

గంజీ–మెతుకులు! ఒక్కోసారి మంచినీళ్ళు.

ఒకనాటి ఉదయాన సీతాలక్ష్మి అత్తయ్య నిలువునా విరుచుకుపడిపోవడంతో సీతాలక్ష్మి లేవనెత్తలేక కేకలు వేసింది.

కేకలు విని వీధిలో నలుగురూ వచ్చి చూసి మంచం మీదకి చేర్చారు. అత్తకు ఏం జరిగిందో తెలుసుకుందామని అటూ ఇటూ తిరుగుతూ సీతాలక్ష్మి పడిపోయింది. ఆ నలుగురే నవ్వుతూ సీతాలక్ష్మిని మంచం మీదకి చేర్చి మళ్ళీ నవ్వుకున్నారు.

కడుపు నొప్పితో వీధి అరుగు మీద అత్త మెలికలు తిరిగి పోతోంది! పురిటి నొప్పులతో సీతాలక్ష్మి బాధపడుతోంది.

వర్షం! పూరింటి కప్పు కన్నాల్లో నుండి వర్షం!

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 26-9-90



ధారలు ధారలుగా వర్షం.

కారుతున్న పూరింటిని చూసి వీధి వాళ్ళు రెండు గొడుగులు తెచ్చారు.

రెండు గొడుగుల కింద రెండు రకాల బాధలు. కన్నీటి ధారలూ వర్షపు ధారలూ కలగలిసిన నీటి చారలు.

సీతాలక్ష్మికి బిడ్డడు పుట్టేడని నాటు మంత్రసాని సంతోషంగా వీధి అరుగుమీదకి వచ్చి చెప్పినప్పటికే అత్త ప్రాణాలు పోయేయని వీధి వాళ్ళ ఏడుపులు - అంత బాధలోనూ సీతాలక్ష్మికి వినబడ్డాయి.

బిడ్డని చూసిన ఆనందబాష్పాలూ, మేనత్త చని పోయిందన్న ఏడుపు కన్నీరూ-సీతాలక్ష్మి కళ్ళ వెంట కన్నీటి కాలువలు.

చాలాసేపటి తరవాత సీతాలక్ష్మి తండ్రి వచ్చేడు! పలకరించబుద్ధి పుట్టలేదు. ప్రాణం లేని మేనత్త శరీరం అలాగే వుంది. అది గమనించిన వీధి వాళ్ళు మరి ఎవరి అవసరం లేకుండా మిగతా పని పూర్తి చేశారు.

ఈ సంఘటన జరిగిన మూడో రోజున భర్త ఇల్లు చేరుకున్నాడు. సీతాలక్ష్మి భర్త ముఖంలోకి చూసింది. కళ్ళంట మళ్ళీ ధారలు ధారలుగా కన్నీళ్ళు.

సీతాలక్ష్మి కన్నీళ్ళు తుడుస్తూ అతను "లాభం నష్టం ఈ రెండు మాత్రమే చూస్తున్న ప్రస్తుత పరిస్థితిలో అన్ని సంబంధాలూ ఇలాగే వుంటాయి. మనం చూస్తున్న ఈ మనుషులు మాత్రమే కారు. మరో లోకం వుంది. అది చాలా మంచి లోకం. మంచినే అక్కడ చూస్తాం తప్ప మరేదీ అక్కడ కనబడదు" అన్న భర్త మాటలు విన్న సీతాలక్ష్మికి మంచి ఆమముందే నిలబడి తనతోనే మాటాడుతున్నట్టుగా అనిపించి పుల కించిపోయింది.

పురిటి స్నానం అయిన మర్నాడు పక్కింటి పెద్దమ్మ వచ్చి తల దువ్వి చిక్కులు తీస్తూ —

"ఒసే సీతా! మీ అత్తలాటి మంచి మనిషిని చూడలేదని నేను చెప్పడం కాదే! ఊరు ఊరంతా చెప్పడం విన్నాను. నా కళ్ళతో చూశాను. సరి ... మీ అత్త ప్రాణాలు సరి ... సరి...! అలాంటి సమయంలో అందరం మీ అత్త ముఖంలోకి చూస్తూ ఏడుస్తున్నాం. అంతకంటే ఏం జేస్తాం?! మీ అత్త చుట్టూ చూసింది. 'నా బిడ్డ ఏడీ? ' అని నన్నే అడిగింది. అప్పటికి మీ ఆయన రాలేదు. ఆశగా మరోసారి చూసి, అదుగో ఆ మూలకేసి వేలు చూపింది. నేను చూశాను. అక్కడ ఆవిడ నిత్యం పూజచేసే దేవుని పటాలు కనిపించాయి. మీ అత్త అతి కష్టం మీద సత్తువంతా కూడదీసుకొని 'నా కోడలికి నేను మిగిలించి ఇచ్చింది అదే! నిత్యం నేను చేసే పూజ నా కోడల్ని చెయ్యమని చెప్పమ్మా! ఏది ఏమైనా ఇల్లు నిలబడుతుంది. ఇదే ... ఈ మాటే తప్పక చెప్పమ్మా! ఆ పూజ మాత్రమే నేను నా కోడలికి మిగించిన ఆస్తి' మరి మాట్లాడలేకపోయింది. వేలకి అలాంటి మనుషులుండరే సీతా అంటూ పెద్దమ్మ కన్నీరు కార్చింది.

సీతాలక్ష్మి కళ్ళు సెలయేళ్ళయేయి! పెద్దమ్మ ఆ మాటలు చెప్పి కొద్ది రోజులైవా కాలేదు_ పోలీసులు వచ్చారు. ఇంట్లోని ప్రతి మూలా వెతి కారు.

సీతాలక్ష్మి ఆలోచించబోయి అర్థంకాక అలా వుండి పోయింది.

తరువాత ఇద్దరు పిల్లలు పుట్టారు. పుట్టిన ముగ్గురు పిల్లలూ పెరిగి పెద్దయినా కాలేదు.

భర్తని జైల్లో పెట్టారని తెలిసింది.

ఆమెకి లోకం చీకటైపోయింది. అంతా అయో మయంగానూ, అగమ్య గోచరంగానూ కనిపించింది. ఆడదిగా తన జీవితం ఎట్నుండి ఎటు మారుతుందో తెలుసుకోవాలని ప్రయత్నించి తెలుసుకోలేకపోయింది.

ఇల్లెలా గడుస్తుందో బిడ్డల్ని ఎలా పెంచాలో ఏం చెయ్యాలో తెలియక ఇంకేమీ తోచక సీతాలక్ష్మి భర్తని చూద్దామనుకొని బయల్దేరింది.

భర్తను చూద్దామని వచ్చిన సీతాలక్ష్మితో జైలు అధికార్లు "నీ భర్తను నువ్వు చూడ్డానికి వీల్లేదమ్మా" అనేశారు.

అది విని ఇంటికి తిరిగి వచ్చిన సీతాలక్ష్మి మరేమీ ఆలోచించలేక - అత్త చూపిందని పెద్దమ్మ చెప్పిన దేవుని పటాల ముందు పడిపోయింది.

ఆ క్షణం నుండి సీతాలక్ష్మి ఆ ఇంటికీ పూజకీ అంకితం అయిపోయింది.

ఇంక దేనికో అంకితం అయిపోయిన భర్త కోసం అలా ఎదురు చూస్తూనే వుంది.